# బతకనేర్సినోళ్లు

''మామా! నువ్వు ఏమీ అనుకోనంటే నిన్నొక్క మాట అడగతాను!''

మా బామార్ది. వై. యం. రెడ్డి. మొన్నొకనాడు ఆ నాలుగ్గాళ్లమండపం కాడ నిలేసె.

అదే యింకెవురన్నా అయ్యుంటే ఆడికాణ్ణే చొక్కాయి పట్టి నిలేసి 'అడగరా!' అని ఐసా పైసా తేల్చుకునే వాణ్ణి. మా బామార్ది కత అట్టగాక పాయనే!

ఇపుడంటే ఈ బతుకుల చీకిపాదల్లో చిగులుకోని అట్టపోలేక యిట్టరాలేక అల్లాడ్తా ఎవుడి దోవ వాడిదిగా ఉండాదికానీ... అదే తాడుతగాదా రొండూ లేనప్పుడు ఒకడు యింకొకడి నీడ అనుకోవాల్సిందే గదా? మరీ మా అరుణాచలం అయితే మాకిద్దరికి కిష్టార్జునులని పేరుగూడా పెట్టె. అది చావుకు పోనీ సంతర్పణకు పోనీ సుబకార్యానికి పోనీ చుట్టపుచూపుగా పోనీ వొకర్ని యిడ్సిపెట్టి వొకరు పొయ్యేది లేదే?

ఒకేళ అట్టా పోవాల్సే వచ్చిందనుకో! –

''వాడేడ మీబామార్ది?'' అని నన్నడిగితే. ''మీ మామను యిడ్సిపేట్టేసి వొకడే ఎట్టొచ్చినావురా?'' అని వాణ్ణి అడిగేవాళ్లు.

ఈదిలో కత అడికయిందా? ఇంక యింటికాడి కొస్తేనా? – మంచీ సెబ్బరకు ముందు నిలబడాల్సింది వాడే! ఇచ్చినా తెచ్చినా అది వాడి చేతలమింద జరగాల్సిందే!

బామార్ది అంటే బతక కోరేవాడు గదా?

అటుమంటోడు... పాణంలో పాణమైనోడు... మాయామర్మం ఎరగనోడు కనిపిస్తానే ''నువ్వు ఏమీ అనుకోనంటే ఒక మాట అడగతాను'' అంటే అది ఎటుమంటి మాటగా ఉండాల? అడగరాని మాటగా ఉంటేనే గదా వాడు అట్టా అడగతాడు. ఇనరాని మాట ఏమి యినాల్సి వస్తిందో? ఏంపాడో? ఇప్పిటికే పనికిమాల్నె యదవల దగ్గిరంతా ఒక మాటపడ్తా వొరగెడ్డాన నిలబడుకోనుండామే! అని అనుకునే కుందికి గుండె గెబీమనె. ఒళ్లంతా చెమటలు పోసె. అయినా రోట్లో తలకాయి దూర్చి రోకలి పోటుకు ఎర్సే దానికి

అవితిందా? అందుకనే కాలు నిలదొక్కుంటి. గుండె దిటవు చేసుకుంటి. అట్టా చేసుకునిం దానికి గుర్తుగా తెంపుగా తెపరాయిస్తి. ఆమిందట ''అడుగు బామర్దీ!'' అంటి.

''అదిగాదు మామా! ఆదినుంచీ నేను గెమనిస్తా ఉండా. 'ఓయబ్బా! అని రొండంటే రొండేదినాలు పూసుకోని రాసుకోని తిరగతాడు. మూడోదినానికంతా మూడామడకు అవతలుంటాడు.' అని ప్రెతోడు అంటా ఉండాడు. నీ బతుకంతా యిట్టా మాదిర్నేనా? అది ఎందుకట్టా?'' అనె.

నేను పకపక నవ్వేస్తి!

''ఈ నవ్వుల్తో అసలు కత ఎగరగొట్టేద్దామనుకుంటే అదేం కుదరదు మామా! ఈ పొద్దు కుర్దుగా అడిగి తెల్సుకుందామనే వచ్చినా.''

''శానా శానా మంచి పని చేసినావు బామార్దీ! అయితే యిది శానా తీరుబాటుగా కూసోని యిలేవరిగా మాట్లాడు కోవల్సిన కత. మనం యిప్పుడు నిలబడుకో నుండేది తిరపతి రోడ్ల మింద. ఏ లారీ ఎగరేసుకోని పోతిందో? ఏ టౌనుబస్సు తొక్కేసి పోతిందో? ఈ సందేహం తీర్చుకోకుండానే చస్తే మల్లా మనం యింకొక జల్మ ఎత్తాల్సి ఉంటింది. అప్పుడు అది ఎట్టా జల్మం వస్తిందో ఏం పాడో? మనం ఏమన్నా కల గన్నామా? నువ్వు యిట్టా పక్కకు రా!'' అంటా మా బామార్ది చెయ్యి పట్టుకోని రొండడుగులేసి గ్రామచావిడి ముందర నిలబడ్తి.

''నువ్వనింది ఏంది? ఇంకొక సారి అను బామార్దీ!''

''అనేదానికేముండాదిలే మామా! నువ్వు సావాసం చేసినోళ్లు అందరూ రొండు దినాలు మూతులు నాకి మూడోదినానికే మూతులు తిప్పుకుంటా రెందుకని?''

''ఈ సందేహం నీకై కలిగిందా? లేదు నిన్నెవరైనా అడిగినారా?''

''నీ కెందుకామాట?''

''సత్తింగా చెప్తా ఉండా. ఎటుమంటి పరిస్తితిలో గూడా ఈ సందేహం నీకు కలిగే దానికే లే. కలిగిందంటే నిన్నెవుడో అడిగుండాల. అడిగినాడంటే నిజింగా వాడు బతకనేర్సిన నాకొడుకై ఉండాల.''

''ఆమాటకొస్తే యీదినాల్లో బతకనేర్సనోడు ఎవుడు మామా?''

''ఆణ్ణే చిన్న లిటిగేషన్ ఉండేది బామార్దీ! ఈ బూమ్మీద ప్రెతోడు బతికి బాలాలనే కన్నగసాట్లు పడ్తాడు. బతికేదానికి ఏదోవొక పని నేర్సుకుంటే గానీ ఎవుడైనా బతకలేడు. ఏదో వొక పని నేర్సుకోని బతకడం యేరు. బతకనేర్సడం యేరు.''

''నువ్విప్పుడు మాట్లాడ్తా వుండేది నేర్సిన మాట్లు''

''నిజిమేనబ్బా! యివి నేర్సిన మాట్లే అనుకుందాం. అయితే యీ నేర్సిన మాట్లు బతక నేర్సినోళ్ల ముందర చలామణి కాలేదే?''

''ఇదేగదా నీతో వచ్చిన పీకులాట. కాలికేస్తే తలకేస్తావ్. తలకేస్తే కాలికేస్తావ్. యిట్టానే సాగ పీకతా ఉంటావా? అడిగిందానికి సమాదానం చెప్తావా?''

''బామార్దీ! అక్కర తీర్తే అక్క మొగుడు కుక్క.''

''అది నిజమే ననుకో.''

''అక్కరపడ్తే అర్దవై ఆరు సార్లు వస్తారు. అడుగడుగు దండాలు పెడ్తారు. అర్సేతిలో వైకుంటం చూపిస్తారు. కుడుం యిస్తే పండగనుకుండే ఈ యదవ బుద్ది ఉండాదే?- కూడు నీళ్లూ కొంపా గోడు అన్నీ యిడ్సిపెట్టేసి వాళ్ల అక్కరకు వొదిగితే ఆమిందట నీయబ్బ నాకేం కావాలంటారు. పని మింద వచ్చే వోళ్లంతా పనోళ్లే గదా బామార్దీ! పనైపోతానే పత్తా లేకుండా పోతారు. అట్టా కానోడు ఎట్ట పోతాడు. ఎప్పుడూ కూడామాడానే ఉంటాడు. ఈళ్లను యిడ్సిపెట్టేసి వాళ్లచుట్టూ పాయ్ తిరగమంటావా?''

''ఒక్కరిద్దర్ని చూస్తావ్. మల్లన్నా బుద్ది తెచ్చుకోవాల గధా?''

''అందరూ అట్నే ఉంటారా? అనుకునే గదా పొప్పులో కాలేస్తా ఉండేది.''

''నేను అడగాల్సిన మాట నువ్వే అంటివే!''

''ఈ రామాయిణమంతా ఎందుకు? రూపకారం చెయ్‌పిస్తే సరిపోలా. ఇనాల్సింది అంతా వాళ్ల నోటిగుండానే యిను. మల్లా కావాలంటే కాలికుండేది చేతికి తీసుకో-''

''అంతపని ఎందుగ్గానీ...''

''అదిగాదు బామార్దీ! అబిమానస్తుడు ఒకడొక మాటంటే పడ్తాడా? ఒకటంటే రొండుగా అని తీర్తాడు. లేకుండాబోతే వొదిలించు కుంటాడు. ఇద్దో యిట్టా మాదిరి అడిగిపించుకుంటాడు. ఎవుడేం కూసినా కాకరించి మొకాన్నే ఊసినా తుడ్సుకోని పొయ్యేటోడు మొగలాయిగా బతికి పోతా ఉండాడు. అనుబోగం అటువుంటోళ్ల పాలయింది. అగుడు నాపరమైంది.''

''నీకు చెప్పేటంతటోణ్ణి కాదనుకో. అయినా వంకలూ వాగులూ ఉండాయి. అవ్వి అప్పుడప్పుడూ పొంగి పొర్లి అమక్కళం చేస్తా ఉంటాయి. ఏమి చేసినా అవి కసువు పోచను ఏమయినా కదిలించ గలగతాయా? అదే నిగుడుకోని నిలబడుండే చెట్టునయితే నేలమట్టం చేసి పారేస్తాయ్.''

''ఇంకేముండాది బామార్దీ! తలొంచ కుండానే బతుకులో పొద్దువాలి పోతా ఉండాది. అదిసరేకానీ తీరుబాటుగా నిలబడుకున్నావ్. ఈపొద్దు యిస్కూలు...''

''ఈపొద్దు ఇండిపెండెన్సుడే. లీవుగదా మామా!''

అప్పుడు గెమనించినా. ఎవురు కట్నారో ఏమో నాలుగ్గాళ్లమండపం మింద మూడు రంగుల జండా రెపరెప లాడ్తా ఉండాది.

''బామార్దీ! నాలుగ్గాళ్లమండపం మింద ఆ జండాను చూడు. ఆ జండా సొంతం

చేసుకోవాలనీ... ఎఱ్ఱకోట మింద ఎగరెయ్యాలనీ ఎంతమంది పోరకలాణ్ణారో తెల్సుగదా? సొతంత్రం వచ్చే నాటికి మన జనాబా యిప్పుడుండే దాంట్లో ఉరామరిగ్గా సగానికి సగం ఉండె గదా?

వాళ్లందురు సొతంత్రం కావాలని పోరకలాణ్ణారా? లేదే. వాళ్లకు తొత్తులుగా కూడా ఉండిపోవాలని అనుకున్నోళ్లగూడా ఉండారుగదా? అట్టకాదని పోరకలాణ్ణారే? వాళ్లందురూ అబిమానస్తులు. అబిమానస్తుడు పాణాన్నిగూడా తెగాయించేస్తాడు. అది లేనోడు అక్కర గడుపుకుంటాడు. అక్కర గడుపుకుణ్ణోడు హాయిగా బతికిపోతా ఉంటే అబిమానస్తుడి బతుకు ఏయిరవకాడ లేసినా రాళ్లకాలవ కాణ్ణే తెల్లార్తా ఉంటింది. అట్టా తెల్లారిపోయ్న బతుకుల్లో ఉయ్యాలవాడ నర్సిమ్మారెడ్డి బతుకొగిటి.''

''ఇప్పటిదాకా ఆపేరే చెవల్లోపల్లా! ఆయన ఎవురు మామా?''

''అదంతే బామార్దీ! మంచి చేసినోళ్లను... మంచి కోసరం పాణాల్నుగూడా తెగించి నోళ్లను మర్సిపోకుండా ఉంటే మనం మణుసులు ఎట్టవతాం? మర్సిపోతే పీడొగిటి పాయ. మల్లా ఏందో ఒక సాకుతో ఏలెత్తి చూపిస్తారే? ఇంతకూ నువ్వు అడిగిందేంది? నర్సిమ్మారెడ్డి ఎవురని గదా? ఇప్పిటికి నూటయబై ఏండ్ల కిందట్నే తెల్లోడి మిందకి తొడదట్టిన జగజ్జెట్టి ఉయ్యాలవాడ నర్సిమ్మారెడ్డి!

ఇప్పిటి కర్నూలు జిల్లాలో కోయిలకుంట్ల తాలూకాలో ఉండాది ఉయ్యాలవాడ. ఒకప్పుడు అది సంస్తానం. ఆ ఉయ్యాలవాడ జాగీర్దారు పెదమల్లారెడ్డి. ఆ రెడ్డికి ముగ్గురు కొడుకులు. వాళ్లల్లో కడగోటోడే నర్సిమ్మారెడ్డి!

తెల్లోడికి వంశిపారంపరంగా వస్తావుణ్ణె మాన్యాలమింద కన్నుపడింది. వాళ్లకుండే హక్కుల్ను రద్దు చేసి పారేసినాడు. జాగీర్లు గుంజుకుణ్ణాడు. తిరొపెం పెట్నెట్టుగా నెలకింతని పించను యిస్తానన్నాడు. అది గూడా వాడబ్బ సొత్తు మాదిరిగా యిష్టమయితే అంత యిచ్చినాడు. అడిగితే యీసడించు కుణ్ణాడు.

కుంపిణీదొరలు దేశాన్ని యిట్టా దోచుకోని తింటా ఉంటే ఉయ్యాలవాడ నర్సిమ్మారెడ్డి ఉగ్రనరసిమ్ముడే అయినాడు.

తెల్లోడికి తెలివి ఉండె. మొందుగుండూ ఉండె. మందీ మార్బలం ఉండె. నర్సిమ్మారెడ్డి అన్నకొడుకు మల్లారెడ్డి మాదిర్తో తెల్లోడికి తొత్తులైనవాళ్లు దేశంమింద యింకా శానామంది ఉండిరి.

నర్సిమ్మారెడ్డికి ఏముండాది? గుండె బలం ఉండాది. కొందురు కొండజాతోళ్లు తోడు ఉణ్ణారు. మాన్యాలు పోగొట్టుకోని మదనపడ్తా ఉణ్ణోళ్లు కొందురు మద్దతుగా నిలబణ్ణారు. ఎరికలోళ్లు యానాదోళ్లు ఎంట ఉంటానన్నారు.

చాలనుకుణ్ణాడు నర్సిమ్మారెడ్డి.

గ్రామాలమింద ట్రెజరీలమింద పడి కొళ్లగొట్టేదానికి మొదులు పెట్నాడు.

తెల్లోడి గుండు బలం ముందు రెడ్డి గుండె బలం చాల్లా. అయితేగూడా రెడ్డి చచ్చే దాకా తలకాయి వంచలా!

వంచని తలను వదిలి పెట్ట గూడదనేది తెల్లోడి బుద్ధి.

అప్పుడు వాడేంచేసినాడో తెల్సునా? నర్సిమ్మారెడ్డితో చేతులు కలిపినారనే సాకుతో కొందుర్ని... అనుమానం మింద ఆర్నూరు మందిని జైల్లో తోసె. వాళ్లను నానా హింసలు పెట్టె. పెండ్లాం బిడ్డల్ను బందుగుల్ను తీసుకోని పొయ్ ఒక బంగాళాలో మూటు పెట్నెట్టు మూసి పెట్టె!

ఎంత చేసినా రెడ్డి లొంగక పాయ!

అదీ అబిమానస్తుడి లచ్చిణం!!

కడాన ఎర్రమల నల్లమల కొండల మద్దె ఉండే జగన్నాదుడి గుళ్లో రెడ్డిని మలేసి పట్టుకుండె. ఉరి శిచ్చ ఏసె. ఉరి తీసిన తలకాయిని తెచ్చి కోయిలకుంట్ల దగ్గిర బురుజు మింద యినప గోలుసుల్తో యాలాడగట్టె. ఎప్పుడు? మనకు సొతంత్రం రాక ముందు సరిగ్గా నూరేండ్లప్పుడు. 1847 నుంచి సమ్మత్సరాల దాకా ఆ తలకాయి అట్టా యాలాడ్తానే ఉణ్ణిందంట!''

''రామ! రామ! యినేదానిగ్గూడా గోరాతి గోరంగా ఉండాది గదా మామా! యిట్టాంటి వాళ్లు ఎంత మందో నూరేండ్లకు ముందర్నే నేలకొరిగి పొయ్ నోళ్లు! వాళ్లను గురించి ఒక్క సెణం ఆలోచించి ఒక్క కన్నీటి చుక్క రాల్సాల్సిన దినాన్ని మిటాయిల పండగ్గా మార్సేసిరి గద మామా?''

మా బామార్ది నోట మాట రాకుండా కండ్లు వొత్తుకుంటా ఉండాడు.

యాడున్నాడో ముత్తారెడ్డన్న ముగ్గులో కొచ్చె!

''ఒరే అబ్బారే!... నర్సిమ్మారెడ్డి మాదిర్తో తలకాయి యిసిర్నోళ్లంతా తలకాయిలు పోగొట్టుకునేసిరి. తెలివిగా తలకాయి వంచి నోళ్లంతా తలకాయి ఎత్తుకోని తిరిగిరి. బతకనేర్సే తెలివంటే యిదేరా! బతక నేర్సినోడికి ఏబాదాలే. ఈడు అయిన వాడు.వాడు కానోడు అన్న కతేలే. అందురూ వొగిటే. అందుకే వాళ్లు యాడికిపొయ్నా అడ్డమూ ఆపూ రొండులే. ఈ లోకంలో ఏందైనా నేర్సుకో వచ్చునేమోగానీ బతకనేర్సేదంటే మాట్లుగాదురా!'' అనె.

నేను మా బామార్ది కల్లా చూసినా!

వాడు లావుగా లంబుగా మోకాళ్ల కిందికి కద్దరు జుబ్బా యేసుకోని ఆ దోవన పోతావుండే వాడి కల్లానే చూస్తా ఉండాడు! ●